


# ఆమె

'నా పేరు భవాని. నా భర్త శేఖర్‌గారు మిమ్మల్ని కలవమన్నారు' సంశయంగా చెప్పిందామె.

'కూచోండి' అన్నాను కుర్చీ చూపిస్తూ.

ఆమెని పరిశీలనగా చూశాను.

అందంగా ఉంది. మర్యాదగా ఉంది. చూడగానే గౌరవించాలనిపిస్తుంది. బాగా చదువుకున్నదని తెలుస్తోంది.

అంతకుముందు రోజు ఆమె భర్త శేఖర్ ఫోను చేశాడు. తనని తాను పరిచయం చేసకుని తన భార్య సమస్య చెప్పాడు. ఈమెకు అలాంటి సమస్య ఉండటం ఆశ్చర్యం అనిపించింది. మరుసటిరోజు ఆమె వచ్చి కలుస్తుందన్నాడు.

'చెప్పండి. ఏమీటీ మీ సమస్య?' అడిగాను.

'వారు చెప్పలేదా?' అడిగింది.

'మన గురించి వేరేవారికన్నా మనం చెప్పుకోవటమే మంచిది కదా?' సూటిగా అడిగాను.

తల ఊపింది.

'నిజానికి నాకూ నా సమస్య ఆశ్చర్యం కలిగిస్తోంది. అసలిదంతా కలనా, నిజమా అనిపిస్తోంది. కానీ...' దుఃఖంతో గొంతు పూడుకుపోయినట్టుంది. మాట పూర్తి చేయలేక పోయింది. సానుభూతిగా చూశాను.

కాస్సేపటికి సర్దుకుని చెప్పసాగింది.

'నేను శేఖర్ రెండవ భార్యని. మొదటి భార్య చాలా అందమైనదట. ఎంత అందగత్తెనో అంత ధనవంతమైన దట. ప్రస్తుతం మేము అనుభవిస్తున్న ఐశ్వర్యం ఆమె వల్ల శేఖర్‌కు సంక్రమించినదేనట'.

తల ఊపాను నేను.

'నాకిదంతా పెళ్లి తరువాత తెలిసింది. ముఖ్యంగా, మేమూ హానీమూన్ పూర్తయిన తరువాత ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో ఉండడం మొదలు పెట్టినప్పుడు నౌకర్ల ద్వారా తెలిసింది. శేఖర్ మొదటిభార్య ఎంత అందగత్తెనో అంత అనుమానం అని. అంత అసూయ

## హారర్ స్టోరీ

### కస్తూరి మురళీకృష్ణ

అని. బ్రతికి ఉన్నన్ని రోజులూ అనుమానంతో శేఖర్ బ్రతుకు నరకం చేసిందట. ప్రతి చిన్నవిషయానికే పెద్దగలాటా చేసి ప్రతిక్షణం నరకం చూపేదట. చివరికి, ఆమెకి కేన్సర్ అని తెలిసినప్పుడు కూడా ఆస్తి కోసం శేఖర్ ఆమెకి కాన్సర్ రోగాన్ని తెప్పించాడని ఆరోపించి గోల చేసిందట'.

మంచినీళ్ల తాగటం కోసం ఆగింది.

ఆమె మాటలు వింటూ, ఆమె మానసికస్థితిని, ఆమె నిజాయితీని అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నాను.

'ఇవన్నీ విన్న తరువాత నాకు శేఖర్ మీద ప్రేమ పెరిగింది. ఎందుకంటే, మొదటి భార్యను విమర్శిస్తూ కానీ, ఆమె వల్ల అనుభవించిన నరకాన్ని గురించి కానీ శేఖర్ నా దగ్గర ఒక్కమాట మాట్లాడలేదు. జరిగినది జరిగిపోయింది. దాన్ని తలచుకుని లాభంలేదు. అనేవాడు. నేను ఎప్పుడయినా ఏమైనా అడిగితే' అంది.

'మరి సమస్య ఏమిటి?'

'సమస్య. శేఖర్ టూర్‌కి వెళ్లినప్పటి నుంచి ఆరంభమయింది. శేఖర్ బిజినెస్ వ్యవహారం వల్ల తరచు టూర్లకు వెళ్తుంటాడు. అలా ఓసారి ఆయన టూర్‌కి వెళ్లినప్పుడు నాకు కొన్ని విచిత్రమైన, భయంకరమైన అనుభవాలు కలిగాయి' వాటిని గుర్తు చేసుకుంటున్నట్టు ఆగింది.



నేను ఆమెనే పరిశీలనగా చూస్తున్నాను.

నిట్టూర్చి, వాటిని తలచుకోవటమే ఇష్టం లేనట్టు, అతి అయిష్టంగా చెప్పటం ఆరంభించింది.

'ఓరోజు రాత్రి ఏవేవో విచిత్రమైన శబ్దాలయ్యాయి. ఎవరో తలుపులు తీస్తూ, వేస్తున్న కిటికీల అద్దాలపై గోరుతో గీస్తున్నట్టు, ఎవరో నడచినట్టు... ఇలాంటి శబ్దాలు వినిపించి నిద్రపట్టేది కాదు. రాత్రిళ్లు శబ్దాలు చేయవద్దని నౌకర్లకు వార్నింగ్ ఇచ్చాను.

'శబ్దాలు ఆగిపోయాయి?'

'తల అడ్డంగా ఊపింది' ఆ శబ్దాలకు మరిన్ని శబ్దాలు తోడయ్యాయి. బాత్రూమ్ నల్లానుండి బొట్లు బొట్లుగా నీళ్ళుకారటం, లైట్లువెలిగి ఆరిపోవటం ఆరంభమయింది. నాకు భయం వేసింది. స్వతహాగా నాకు ధైర్యం ఎక్కువ. కానీ ఇలా శేఖర్ ఊరువెళ్ళిన రాత్రిళ్ళు కావటంతో, ఎవరికో నేను ఆ ఇంట్లో ఉండటం ఇష్టం లేదనిపించింది. శేఖర్‌తో అదే చెప్పాను. శేఖర్ నవ్వి నా మాటలు కొట్టేశాడు'.

'తరువాత?' అడిగాను.

'ఈసారి శేఖర్ ఊరు వెళ్లినప్పుడు నిద్ర పడుతుండగా చెవిలో ఎవరో ఏదో చెప్పినట్టనిపించి మెలకువ వచ్చింది. మెలకువ వచ్చేసరికి ఎవరో గది వదలి వెళ్లినట్టనిపించింది. ఆ తరువాత రోజు షెల్ఫ్ నుండి వస్తువులు పడిపోయాయి. ఆ తరువాత.. ఆ తరువాత..' చేతుల్లో ముఖం దాచుకుంది.

'ఆ తరువాత?' రెట్టించాను.

'ఆమె కనిపించింది' దాదాపుగా గుసగుసగా చెప్పింది.

'ఎవరు?' అయోమయంగా అడిగాను.

'ఆమె... శేఖర్ మొదటి భార్య'.

కాస్సేపు మా ఇద్దరి మధ్య మౌనం నెలకొంది. మౌనాన్ని భగ్నం చేస్తూ అడిగాను' ఎలా ఉంది? ఏమంది?'

'ఆమె రూపం స్పష్టంగా కనబడలేదు. ఆకారం లీలగా, చీకట్లోంచి కనిపించింది. ఆమె నన్ను కోపంగా చూసింది. బుసలు కొట్టింది'.

'ఏమీ మాట్లాడలేదా?'

'తల అడ్డంగా ఊపింది. మొదటిసారి ఏమీ మాట్లాడలేదు'

'అంటే, ఇంకొన్నిసార్లు కనిపించిందా?'

'ముందు ఆమె ఎవరో నాకు తెలియలేదు. బెదిరిపోయాను. ఆమె అలా కనబడటం నా భ్రమ అనుకున్నాను. ఎందుకంటే అలా కని

పించింది క్షణకాలమే. ఒకసారి హఠాత్తుగా నిద్ర మెల కువరాగానే ఎవరో ఉన్నట్టు ఆకారం కనిపిస్తుంది. తీరా చూస్తే, దుప్పటి పడి ఉంటుంది. బట్టల్లో, ఇతరాలేవో మనిషిలా అనిపిస్తాయి. ఇదీ అలాంటిదే అనుకున్నాను. కానీ తరువాత రాత్రి తెలిసింది ఇది నా భ్రమ కాదని'.

'ఎలా?'

'ఆమె నాతో మాట్లాడింది. నన్ను వెళ్లిపొమ్మంది. నేను ఆమె ఆస్తిని అనుభవిస్తున్నానట. నన్ను బ్రతకనివ్వ నని అంది. తనదైనదాన్ని వేరే ఎవ్వరూ అనుభవించటం భరించలేనంది. ఆస్తితో సహా ఆమె భర్తతోనూ కులుకుతు న్నాను కాబట్టి నన్ను చంపుతానని అంది' చివరి



# మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

## ఆటోమేటిక్ రివాల్వర్

హోటల్లో రెండవ అంతస్తులోని గదిలో కూర్చుని టీ తాగుతున్నాడు డిటెక్టివ్. అంతలో 'హెల్ప్', 'హెల్ప్' అంటూ ఓ ఆర్తనాదం వినిపించింది.

ఉన్నపళంగా లేచి బయటికి పరిగెత్తాడు డిటెక్టివ్.

213 నంబరు గది ముందు నిల్చుని ఓ స్త్రీ రోదిస్తున్నది.

గది తలుపు తెరచి వుంది. లోపల సోఫా మీద ఓ వ్యక్తి పడి వున్నాడు. ఛాతీనుండి నెత్తురు కారుతున్నది.

జరిగిందేమిటో చెప్పమని ఆ స్త్రీని అర్థించాడు డిటెక్టివ్.

''రెండు నిమిషాల క్రితం 'టెలిగ్రాం' అంటూ ఎవరో మా గది తలుపు తట్టారు. నేను తలుపు తీశానో లేదో, ఓ వ్యక్తి గుమ్మం బయటే నిల్చుని టపటపమంటూ నా భర్తను షూట్ చేసి పారిపోయాడు''.

నేల మీద పడుంది ఆటోమేటిక్ రివాల్వర్. దానికి సైలెన్సర్ కూడా వుంది.

లోపలికి ప్రవేశించి, గదినంతా పరిశీలించాడు డిటెక్టివ్.

ఖాళీ బులెట్ షెల్ ఒకటి కాలికి తగిలింది. ఎడమవైపున మరో షెల్ పడి వుంది. అది గోడకు తగిలి కింద పడింది.

''ఓకే మేడం, పోలీసుల వచ్చేలోగా, నాతోనైనా నిజం చెప్పండి'' అన్నాడు డిటెక్టివ్.

అతనికెందుకా అనుమానం వచ్చింది.

**సమాధానం:** హంతకుడు కారిడర్‌లో నిల్చుని రివాల్వర్ పేల్చితే, బులెట్ షెల్స్ నేరుగా ఎడమ వైపు వెళ్లవు.

ఆటోమేటిక్ రివాల్వర్ పేలినప్పుడు షెల్స్ కొన్ని కుడి వైపూ, మరికొన్ని షూటర్ వెనకాపడతాయి.

మాటలు అంటున్నప్పుడు ఆమె గొంతు వణికింది.

ఆమెని చూస్తుంటే, ఆమె నిజాయితీగానే చెప్తున్న దని అనిపిస్తోంది. ఆమె అనుభవం ఆమెకి సత్యం అని అర్థమయింది.

నేను ఆలోచిస్తూ కుర్చీలో వెనక్కి వాలేను.

మనిషి మనస్సు చాలా చిత్రమయినది. ఒకరి అనుభవం మరొకరికి అర్థం కాదు. ఒకరికి సత్యం, మరొకరికి అపహాస్యం. ఈమె మానసికంగా చాలా బాధకు గురవుతున్నట్టుంది.

సాధారణంగా, రెండవ పెళ్లివాడిని చేసుకున్న మహిళలకు ఇలాంటి మానసిక సమస్య ఎదురవుతుంది. తమని, తొలి భార్యతో పోల్చుకుంటారు. తమ భర్త, తొలి భార్యతో అనుభవించిన సాన్నిహిత్యాన్ని ఊహించుకుని కుములుతారు.

ఈ కేసులో ఈమె కన్నా మొదటిభార్య అందగత్తె. ధనవంతురాలు. పైగా ఆమెకి అసూయ అధికం అని ఈమెకు తెలిసింది. దాంతో, మొదటి భార్య తనని చూసి అసూయ పడుతున్నదని ఊహించటం వల్ల ఈమె అహం సంతృప్తి పడుతుంది. అహాన్ని సంతృప్తి పరచుకోవటం కోసం మనుషులు ఆడే నాటకాలే కదా జీవితం. కానీ ఈమెకి ఉన్నదన్నట్టు చెప్తే నమ్మదు. పైగా మరింత న్యూనతా భావానికి గురయి లేనిపోని పనులు చేసినా చేయవచ్చు.

ఇలాంటి వారికి నిజం నిరూపించటం తప్ప మరో మార్గం లేదు.

'చూడండి' గొంతు సవరించుకున్నాను. 'మీరు చెప్పేది వింటుంటే మీరు అబద్ధం చెప్పటం లేదనిపిస్తోంది. కానీ నమ్మటం కష్టం అనిపిస్తుంది. ఎందుకంటే...' నా మాట పూర్తి కాకముందే అడ్డుపడింది. 'మీరు కావాలంటే, రాత్రికి వచ్చి మీ కళ్లతో చూడండి. బహుశా, మిమ్మల్ని చూసి బెదిరి నన్ను వదిలి పారిపోతుందేమో' అంది కోపంగా.

'అంత భయంకరంగా ఉన్నానా?' అంటూ నవ్వాను.

ఆమె కూడా నవ్వేసింది.

'నాకు బాధగా అనిపిస్తుంది. ఎవ్వరూ నన్ను నమ్మటం లేదు. చివరికి శేఖర్ కూడా నన్ను మీ దగ్గర పంపించాడు' అంది బాధగా.

'నేను మానసికవైద్యుడినే కాదు. పారా నార్మల్ విషయాలపై పరిశోధనలు చేస్తున్నాను కూడా. ఇతరుల లాగా దయ్యాలు లేవని కొట్టివేయను. కానీ చెప్పిన ప్రతి వారినీ నమ్మితే, అభాసుపాలవుతాము. నేనూ, నా పరిశోధన' అన్నాను అనునయంగా.

తల వంచుకుంది.

'నేను. ఇవ్వాళ్ల రాత్రికి వస్తాను. కాస్త ముందు వస్తాను. ఎందుకంటే, నా పరికరాలను సరైన పొజిషన్లలో ఉంచాలి'.

'పరికరాలా?' సందేహంగా అడిగింది.

నవ్వాను. 'ఇదిగోండి. ఇది నా ఒలింపస్ కమేడియా సి – 3000 కెమెరా, దీన్లో నేను 400–800 స్పీడ్ ఫిల్మ్ వాడతాను. ఇలా బోలెడన్ని దయ్యాల ఫొటోలు తీశాను'.

ఆమె నా వైపు భయంగా చూసింది.

భయం లేదన్నట్టు నవ్వాను. 'ఇది నా డిజిటల్ ఆడియో రికార్డర్. చెవులకు వినబడని శబ్దాలు రికార్డు చేస్తుంది. ఇది నా వీడియో రికార్డర్. అలాగే, ఇది మోషన్ డిటెక్టర్. ప్రతి చిన్న కదలికను పసికడుతుంది. వీటికి తోడు రాత్రిపూట కనబడే 'నైట్ విజన్' కళ్లద్దాలు ఉన్నాయి. ఇవన్నీ సరిగ్గా ఏర్పాటుచేసుకుని మిమ్మల్ని పీడిస్తున్న దయ్యం కోసం ఎదురు చూస్తాను' చెప్పాను.

ఆమె నవ్వింది.

ఆమె బయలుదేరుతూంటే చెప్పాను. 'మరో విషయం, నేను వస్తున్నట్టు ఎవ్వరికీ తెలియకపోవటం మంచిది. తెలిస్తే, ఇలా మిమ్మల్ని మనుషులెవరైనా బెదిరిస్తుంటే జాగ్రత్త పడతారు'.

చిత్రంగా నవ్విందామె. బ్యాగులోంచి ఇంటి తాళం చెవి తీసి ఇచ్చింది.

'నేనివ్వాళ్ల స్నేహితులతో సినిమాకు వెళ్తున్నాను. రాత్రి ఆలస్యంగా వస్తాను' అంది.

'వెరీగుడ్' అన్నాను తాళం చెవి అందుకుంటూ.

***

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

చకచకా నా పరికరాలను వాటివాటి పొజిషన్లలో అమర్చాను. అన్నీ సవ్యంగానే ఉన్నాయి.

గదిలో ఎలాంటి పార్మానార్మల్ ఏక్టివిటీ లేదు.

తలుపుతీసిన శబ్దం అయింది.

నిశ్శబ్దంగా నీడలలోకి ఒదిగాను.

భవాని గదిలోకి వచ్చింది. గది పరిశీలనగా చూసింది.

'ఉన్నారా?' అడిగింది.

నీడలలోంచి బయటకు వచ్చాను.

'హమ్మయ్య. ఇవ్వాళ్ల తేలుతుంది. నేను నిజం చెప్తున్నానో, అబద్ధం చెప్తున్నానో' అంది.

ఆమె మాటలు పూర్తికాకముందే, 'ధఢ్' అన్న శబ్దం వినిపించింది.

ఆమె నా వైపు భయంగా చూసింది.

'భయం లేదు. మీరు మంచంపైన పడుకున్నట్టు నటించండి' అంటూ చకచకా మెషిన్ ఆన్ చేశాను.

ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్ డిటెక్టర్‌లో కదలిక కనిపించింది.

అంటే... అంటే... ఆమె అబద్ధం చెప్పటం లేదన్న మాట!

ఆ ఇంట్లో ప్రస్తుతం దయ్యం ఉంది!

నా రోమాలు నిక్కపొడుచుకున్నాయి. ఎన్నిసార్లు అనుభవించినా ప్రతి సారీ ఏదో తెలియని ఉద్విగ్నత పట్టి పీడిస్తుంది.

ఆమె పడుకుని నా వైపు చూస్తోంది భయంగా.

'నా వైపు చూడకండి. మామూలుగా ఉండండి. మీకేం భయం లేదు. నా దగ్గర లైసెన్స్ ఉన్న తుపాకీ ఉంది' అన్నాను.

ఆమె నవ్వింది. 'దయ్యాలను తుపాకులు ఏం చేయలేవుగా' అంది.

'ఏమీ చేయకున్నా మనసు ధైర్యంగా ఉంటుంది. శబ్దానికి అవి బెదురుతాయి' అన్నాను. నీడల్లోకి జారుకుంటూ, జేబులోని తుపాకీని తడుముతూ.

నా మాట పూర్తికాక ముందే, 'జుయ్' మంటు చల్లనిగాలి వేగంగా కిటికీలోంచి గదిలోకి ప్రవేశించింది.

ఆ వచ్చింది గాలి కాదు. గాలి లాంటి మనిషి అనిపించింది.

పరదాల చాటును గోడకు అతుక్కుని నుంచున్నాను. చీకట్లోకి కళ్లు చికిలించి చూస్తున్నాను.

'టపటప' మంటూ ఏదో పక్షి కిటికీ తలుపుల మీద వాలి, క్షణం సేపు గది లోకి చూసి ఎగిరిపోయింది.

కిటికీ వైపు చూశాను.

బయట ఆకాశంలో చంద్రుడిని మేఘం కప్పేస్తోంది. దాంతో అప్పటి వరకూ కిటికీలోంచి లోపలకు వస్తున్న వెన్నెల వెలుగు కూడా ఆగి పోయింది. గది మరింత చీకటిగా అయింది.

'ధడ్' మళ్లీ శబ్దం వినిపించింది.

శబ్దం ఏ వైపు నుంచి వస్తోందో సరిగ్గా అంచనా వేయలేక పోయాను.

ఇంతలో ఎక్కడో 'కిర్రు'మన్న శబ్దం వినిపించింది.

ఎవరో కాళ్లు నేలకి రాస్తున్న శబ్దం వినిపించింది.

'టక్...టక్...టక్' ఏదో పక్షి చెట్టు బెరడును పొడుస్తున్నట్టున్న శబ్దం అది.

జేబులో తుపాకీని తడుముకున్నాను. మంచం వైపు చూశాను.

ఆమె మంచంపై కూచుని ఉంది. భయంగా చుట్టూ చూస్తోంది.

ఇంతలో 'ధబ్' మన్న శబ్దం చాలా నెమ్మదిగా వినిపించింది. సుతిమెత్తని పాదాలు, కాదు... కాదు... సన్ననిగాలి మెట్లను తాకుతున్నట్టుంది ఆ శబ్దం.

ఎవరో మెట్లు ఎక్కుతున్నట్టు తెలుస్తోంది.

వైబ్రేషన్స్‌ను పసికట్టే పరికరం వైపు చూశాను. అది గిలగిల కొట్టుకుంటోంది. వీడియో రికార్డవుతోంది.

శబ్దం తలుపుల దగ్గరకు వచ్చి ఆగింది.

ఏదోచల్లని గాలివీస్తే తెరుచుకున్నట్టు, నిశ్శబ్దంగా తెరచుకున్నాయి తలుపులు.

ఆవైపే చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను. తెరచిన తలుపుల వెనుక ఆమె నిలబడి ఉంది!

ఆమె ఆకారం కనిపిస్తోంది కానీ ముఖం స్పష్టంగా కనిపించటం లేదు.

వెంటనే మంచం వైపు చూశాను.

మంచం పైన భవాని వణికిపోతోంది.

తలుపు దగ్గర నుంచి కదలి ఆమె లోపలకు అడుగు పెట్టింది.

అంత స్పష్టంగా ఇంతవరకూ ఏ దయ్యాన్నీ నేను రికార్డు చేయలేదు. ఓ వైపు ఉత్తేజంగా ఉంది. మరో వైపు ఉద్విగ్నంగా ఉంది. భయంగా కూడా ఉంది.

లోపలకు అడుగుపెట్టిన ఆమె దృష్టి మంచంపై కూచుని తన వైపే భయం భయంగా చూస్తున్న భవానిపై పడ్డాయి.

కోపంతో ఆమె ముక్కు పుటాలదిరాయి. కళ్లు ఎర్రబడ్డాయి.

అది చూస్తూ భవాని మరింత బెదిరించింది.

'ఏయ్' అరిచింది ఆమె.

బెదిరిన లేడి పిల్లలా లేచి నిలబడింది భవాని.

'ఎందుకొచ్చావిక్కిడికి? నిన్ను నా గదిలో అడుగు పెట్టవద్దన్నానా? ఇది నా ఇల్లు. నీది కాదు. ఫో... ఫో... రావద్దు.... వెళ్లి పో' గర్జించినట్టు అరిచిందామె.

భవాని గజగజ వణికిపోతోంది.

'నిన్ను చూడాలని లేదు. నీతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాకు శేఖర్‌తో సంబంధం... ఫో... ఫో... మళ్లీ ఈ చుట్టుపక్కలకు రావద్దు' బెదిరిస్తూ అరిచింది.

చిగురుటాకులా వణికిపోతోంది భవాని.

మీటర్లన్నీ దయ్యం ఉనికిని పసికట్టేశాయి. రీడింగులు రికార్డవుతున్నాయి.

ఆమె గుడ్లురిమింది. పళ్లు కనిపించేట్టు నోరు తెరిచింది.

భవాని మంచం వదిలి నా వైపు అడుగులు వేస్తోంది. ఆమె వైపు నుంచి దృష్టి మరల్చకుండా 'ఫో.. ఫో' అరిచింది ఆమె.

'ఈ వైపు రాకు' హెచ్చరించాలనుకున్నాను. ఎందుకంటే ఈ వైపు కిటికీ తప్ప బయటకు మరోమార్గం లేదు. కిటికీలోంచి దూకటం ప్రమాదకరం.

ఆమెకోపంగా చుట్టూ చూసింది. ఏదో వెతుకుతున్నట్టుంది. వెతుకుతున్న వస్తువు దొరికినట్టు ఆమె కళ్లు మెరిశాయి. ఆమె వంగింది. క్రింద నుంచి ఇనుపరాడ్‌ను తీసింది.

'ఫో... వెళ్లిక్కడి నుంచి... మళ్లీ నా గదిలోనే కాదు. నా జీవితంలో అడుగు పెట్టవద్దు. నాకిక కనిపించకు' అంటూ రాడ్‌ను ఊపుతూ, భయంకరంగా భవానీ మీదకురాసాగింది. అరవటం కూడా మరచిపోయి భయపడుతోంది భవాని. ఆమె వైపే భయం భయంగా చూస్తూ వెనక్కు అడుగులు వేస్తోంది.

'పోతావా లేదా? మళ్లీ ఈ దరిదాపుల్లో కనిపించవద్దు. శేఖర్ నా వాడు. ఈ ఇల్లు నాది. ఈ ఆస్తినాది. ఫో' అంటూ రాడ్‌ను బలంగా ఊపింది.

'రాడ్' భవానీకి తగిలిందనే అనుకున్నాను.

చివరిక్షణంలో తెలివి వచ్చినట్టు తప్పుకుంది భవాని 'కెవ్వు'మని కేక పెట్టింది. వెనక్కు తిరిగింది.

ఆమె వికటాట్టహాసం చేసింది.

'నీ కోసమే దాచి ఉంచానీ రాడ్. ఇవాళ్టితో నీ పని ఆఖరు' అంటూ రాడ్ పట్టుకుని ముందుకు దూకింది.

గోడకు అతుక్కుపోయిన భవాని నిస్సహాయంగా నా వైపు చూసింది.

ఆమె రాడ్ ఎత్తి పట్టుకుని పరుగెత్తుకు వస్తోంది.

నేను ఆలస్యం చేయలేదు. ఇంకా ఉపేక్షిస్తే ప్రమాదం. ఆ రాడ్ తలపై పడితే భవానీ తల చితకటం ఖాయం.

జేబులోంచి తుపాకీ తీశాను.

ఆమె భవానీని చేరుకుంది.

భవాని గజగజ వణికిపోతోంది. రెండుచేతులు తలపై పెట్టుకుని 'సరెండర్' అయి పోయినట్టు కూచుండిపోయింది.

'ఛావు' అంటూ ఆమె రాడ్‌ని బలంగా ఎత్తిపట్టుకుంది.

'ఆగు' అంటూ నీడలలోంచి దూకాను.

ఆమె వినిపించుకోలేదు. 'ఛావు. ఛావు' అని అరుస్తూ రాడ్‌ని బలంగా భవానీ తలపై దింపసాగింది

ఆమె దృష్టి మళ్లించాలంటే తుపాకీ పేల్చకతప్పదు. అందుకే లాభం లేదని తెలిసినా తుపాకీ పేల్చాను.

'ఢాం'

ఆ తరువాత జరిగిందంతా స్లోమోషన్‌లో, కలలో జరిగినట్టు జరిగింది.

రాడ్‌బలంగా దింపుతున్న ఆమె తుపాకీ శబ్దానికి బెదిరి ఈ వైపు చూసింది. అంతలోనే ఆమె ముఖంలో ఆశ్చర్యం కనిపించింది. ఆ తరువాత ఆశ్చర్యం బాధగా పరిణమించింది.

ఆమె చేతులోంచి రాడ్ నేలపై పడింది. పెద్ద శబ్దమయింది.

రెండు చేతులతో ఆమె గుండెలను పట్టుకుంది. ఆమె శరీరంలోంచి తుపాకీ గుండు బయటకు వచ్చిన రంధ్రం లోంచి రక్తం కారసాగింది.

నావైపు ఆశ్చర్యంగా, బాధగా చూస్తూ ఆమె నేలపై పడింది. క్షణకాలంలో ఆమె క్రింది నుండి రక్తం బయటకు పారసాగింది.

నాకేం జరుగుతుందో అర్థం కాలేదు. నా చేతుల్లోంచి తుపాకీ జారిపోయింది

వెర్రిగా భవానీ వైపు చూశాను.

అక్కడ భవానీ లేదు.

నా చుట్టూ సుళ్లు తిరుగుతున్న గాలి తెరలు తెరలుగా నవ్వుతున్నట్టుంది.

❑

కవిత

## వీడ్కోలు నీడలో....



వీడ్కోలు మూడక్షరాలు కాదు...
మనసు పొరలపై ఝుళ్లకంచెతో చరిచే బాధ..
సుదీర్ఘ చీకటిలోకి నెట్టేసే నిషిద్ధ వెన్నెల...
నిర్ఘోషి మెడలో
చితికిన బంధాల సర్పపరిష్వంగం...
ప్రాధాన్యతల ఆధారంగా సాగే జీవన ప్రస్థానంలో
కలిసి నడిచిన పాదాలకు కఠినమైన సెలవు...
ఎక్కడో ఓ మలుపులో వీడ్కోలు పలకాల్సిందేనేమో...
అనంత కాలమో అత్యల్పమో
ఆత్మిక మానస్సరోవరంలో సహపయనం చేసి,
చిరునవ్వుల కుశలాన్ని కనుచూపులతో ప్రశ్నించి
ఏదో ఓ మలుపులో అకారణంగా వీడ్కోలు పలకడం..
జీవన ప్రయాణంలో అనివార్య సూత్రమైనా...
వీడ్కోలు పలకడమంటే ...
ఒణికిన ప్రాణం చలికి గడ్డ కట్టడమే..
అనుబంధపు రెక్కలు ముక్కలు చెక్కలు కావడమే
పరిపూర్ణంగా రాయాల్సిన వాక్యాలు
వ్యాకరణం లోపించిన కవిత్వంగా మారినట్లు..
జాడలు చెప్పకుండా నిష్క్రమించే జ్ఞాపకాల నీడలు...
కల్లోల హృదయాన్నావిష్కరించే ఆ వీడ్కోలు...
బూజుపట్టిన ముఖ చిత్రాల పాదముద్రలుగా మారతాయి.
వీడ్కోలు పలకడమంటే...
తాబేలు తన డిప్పలోకి తాను కుంచింకుపోయినట్లు...
ఊపిరి పోసుకున్న మమతలకు ఉరిశిక్ష విధించినట్లు...
ప్రతి వీడ్కోలు ఒక విషాద గీతమే...
నిశ్శబ్ద జలప్రళయం లాంటి నీ వీడ్కోలు నన్ను
ఏకాంత సైకత మాళిగలో ఖైదీనీ చేసినా....
నాకు తెలుసు ఇది జీవితపు చివరి
మజిలి కానేకాదు..
వీడ్కోలు కంచుకోటను బద్దలు కొట్టే
ఆత్మీయ ఎదురు చూపుల్ని పోగేసుకుంటున్నా...!!

-సంగెవేని రవీంద్ర